పశ్చిమలో ఒక్క చోటా వైకాపా గెలిచే పరిస్థితి లేదు

● ఉండి నియోజకవర్గ పూర్వ కన్వీనర్ నరసింహరాజు వెల్లడి ● ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటన

పెదఅమిరం (కాళ్ల), న్యూస్‌టుడే: 'ఉండి నియోజకవర్గంలో వైకాపా గెలవడం కష్టమని 2017లోనే జగన్‌కు చెప్పా. అయినా హైదరాబాద్‌లో వ్యాపారం చేసుకుంటున్న నన్ను తీసుకొచ్చి ఇక్కడ రెండు సార్లు పోటీలో నిలబెట్టారు. ఓడిపోయినా పార్టీని వదల్లేదు. ఒక్క రూపాయి కూడా ఆశించకుండా పార్టీ కోసం ఖర్చు చేసి నష్టపోయా.. అయినా తగిన గౌరవం లేదు.. అందుకే పార్టీకి రాజీనామా చేస్తున్నా' అని వైకాపా ఉండి నియోజకవర్గ పూర్వ కన్వీనర్ పీవీఎల్ నరసింహరాజు ప్రకటించారు. కాళ్ల మండలం పెదఅమిరంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అధిష్ఠానం తీరు, నియోజకవర్గంలో కొత్త ఇన్‌ఛార్జి ఎంపికపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓడిపోతానని తెలిసి కూడా జగన్ మాట కోసమే రెండు సార్లు సొంత ఖర్చుతో పోటీ చేశానని.. ఏనాడు పార్టీని అడ్డుపెట్టుకొని పైరవీలు చేయలేదని పేర్కొన్నారు. గత రెండు నెలలుగా కొందరు ముఖ్య నాయకులు ఇక్కడి

మాట్లాడుతున్న నరసింహరాజు

కార్యకర్తలకు ఫోన్లు చేసి కొత్త కన్వీనర్‌గా ఎవరిని నియమిస్తే బాగుంటుందని ఆరా తీశారని.. ఈ విషయం తన దృష్టికి రావడంతో రాజీనామాకు సిద్ధమైనట్లు తెలిపారు. రెండు రోజుల క్రితం జగన్‌ను కలిసి పార్టీ కోసం కష్టపడి పనిచేసినవారిలో ఎవరికైనా కన్వీనర్ బాధ్యతలు అప్పగించాలని, యోగేంద్రకుమార్(బాబు)ను నియమిస్తే మాత్రం ఆయనతో కలిసి పనిచేయలేనని చెప్పి.. కలవపూడికి చెందిన ప్రసాదరాజు పేరు సిఫార్సు చేసినట్లు వెల్లడించారు. ఇది జరిగి 48 గంటలు కూడా గడవకుండానే.. నీ లెక్క ఏముంది అనే రీతిలో అతడినే కన్వీనర్‌గా నియమించారని తెలిపారు. పార్టీ కోసం ఆస్తులు పోగొట్టుకున్న తనకు తగిన గౌరవం ఇవ్వకపోవడం వల్లే రాజీనామా చేస్తున్నానని పేర్కొన్నారు. యోగేంద్రకుమార్ గత ఎనిమిదేళ్లలో పార్టీ తరపున ఏ కార్యక్రమంలో పాల్గొన్నారో ఆధారం చూపిస్తే.. అతడి నియామకాన్ని అంగీకరిస్తానని చెప్పారు.

పతనానికి ఇద్దరు నాయకులే కారణం

పశ్చిమగోదావరి జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఒక్క చోట కూడా వైకాపా గెలిచే పరిస్థితి లేదని నరసింహరాజు పేర్కొన్నారు. ఇక్కడ ఇద్దరు నాయకుల వల్ల పార్టీ పతనమైందని, అధిష్ఠానం వారి మాటలు విని ఇద్దరు నాయకులు, ఇప్పుడు తాను పార్టీకి దూరమయ్యేలా చేసిందన్నారు. నిజాయతీగా పనిచేసే వారిని పక్కన పెట్టి డమ్మీ నాయకులకు పదవులు కట్టబెడుతున్నారని విమర్శించారు. సన్నిహితులతో చర్చించి వారం రోజుల్లో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానని, ఏ పార్టీలో చేరేది కూడా ముందుగానే చెబుతానన్నారు.

రప్పిస్తుంటారు.. ఇప్పిస్తుంటారు

ఈనాడు-ఏలూరు

ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే పీజీఆర్ఎస్‌కు వచ్చి రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తారు. అది ఏ శాఖ పరిధిలోకి వస్తుందో చూసి దాని పరిష్కారానికి ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది. అయితే కొందరు పదే పదే తమ స్వలాభం కోసం ఫిర్యాదులు ఇస్తున్నారు.

● ఆ పది, 15 మందే 700 ఫిర్యాదులా?

● వీరి గురించి నివేదిక కోరిన సర్కారు

పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదుల స్వీకరణ

వ్యక్తిగత లబ్ధి ఆశించి కొందరు అధికారులను బ్లాక్‌మెయిల్ చేయాలనే ఉద్దేశంతో ఒక సమస్యపై వారితో పాటు మరికొందరితో పదేపదే అర్జీలు ఇప్పిస్తున్నారు. అది ఏకంగా 60-70 ఉండటం నమ్మశక్యం కావడం లేదు. వారికే ఇన్ని సమస్యలు ఎందుకున్నాయి? అసలు వారెవరు? నిజంగా వారు పెట్టిన పిటీషన్లు వారివా? లేక ఇతరుల తరపున వీరు పెట్టారా? అలా పెట్టడం వెనుక వారి అసలు ఉద్దేశం ఏమిటని ప్రభుత్వం వారి వివరాలు కోరింది. ఆ పది, పదిహేను మంది నుంచే సగటున ఒక్కొక్కరి నుంచి 50 నుంచి 70 దాకా ఫిర్యాదులు వచ్చాయి. అవన్నీ కలిపితే 700 సమస్యలయ్యాయి. ఒకే సమస్యపై నిబంధనలకు విరుద్ధంగా 10-15 సార్లు అర్జీ ఇవ్వడంతో పాటు వాటికి ఎండార్స్‌మెంట్లు కోరారు.

ప్రభుత్వ సేవలపై అపనమ్మకం కలిగేలా..

కూటమి ప్రభుత్వం సమస్యలు పరిష్కరించడం లేదనే భావన ప్రజల్లో కలిగించటానికి వీరితో ఎవరైనా ఫిర్యాదులు చేయిస్తున్నారా? లేక అధికారులను బ్లాక్‌మెయిల్ చేసి వ్యక్తిగత లబ్ధి చూసుకోవాలనుకుంటున్నారా అనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు. ప్రభుత్వ పరిశీలనలో 81 మంది వేల సంఖ్యలో ఫిర్యాదులు చేశారని తేలింది. ఇంతకీ వారెవరు? వారికి, ఆ సమస్యకు పొంతన ఉందా? లేదా? ఎప్పటి నుంచి దరఖాస్తులు చేస్తున్నారు? నిర్దేశిత గడువు ముగియకుండానే ఎన్నిసార్లు ఫిర్యాదు చేశారు వంటి సమాచారాన్ని పీజీఆర్ఎస్ పోర్టల్ నుంచి డౌన్లోడ్ చేస్తున్నారు. వారి వివరాలు పంపాలని ప్రభుత్వం కోరిందని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి.

వీరి నుంచే అత్యధికం

● మండవల్లికి చెందిన ఓ వ్యక్తి ఎన్‌హెచ్ విస్తరణలో స్థలాలు కోల్పోయిన వారికి పరిహారం ఇచ్చే విషయమై 40 ఫిర్యాదులు ఇచ్చారు.

● కామవరపుకోటకు చెందిన ఒకరు అతను, భార్య పేరుతో భూ సమస్యలపై 70 సార్లు ఫిర్యాదు చేశారు.

● దెందులూరుకు చెందిన ఒకరు 60, భీమడోలుకు చెందిన మరొకరు 60, ముదినేపల్లిలో రహదారి ఆక్రమణలపై మరొకరు పెద్ద సంఖ్యలో ఫిర్యాదు చేశారు.

తెదేపాకు కార్యకర్తలే అధినేతలు: మంత్రి

కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలి

నరసాపురం, న్యూస్‌టుడే: తెదేపాకు కార్యకర్తలే అధినేతలు అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సంజీవరెడ్డిగారి సవిత అన్నారు. నరసాపురం తెదేపా కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అధ్యక్షతన కార్యకర్తలు, నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఇళ్లు, సంక్షేమ పింఛన్లు మంజూరు కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పలువురు మంత్రిని కోరారు. ప్రజలకు అండగా ఉంటున్న కూటమి ప్రభుత్వాన్ని బలపరచాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. ఈ సందర్భంగా తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు నాగిడి రాంబాబు ఆధ్వర్యంలో, చేనేత కార్మిక విభాగ నాయకులు మంత్రిని సత్కరించారు. అనంతరం ఈ నెల 27నుంచి నిర్వహించనున్న ఇంటింటికీ రెండేళ్ల విజయం గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఏఎంసీ ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

'తల్లికి వందనం'తో ఆర్థిక భరోసా

పాలకొల్లు మార్కెట్, యలమంచిలి, న్యూస్‌టుడే: కుటుంబంలో ఎంత మంది పిల్లలు చదువుకుంటే వారందరికీ తల్లికి వందనం పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తూ కూటమి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు బీవీఆర్ఎం బాలికల ఉన్నత పాఠశాల, యలమంచిలి మండలం దొడ్డిపట్ల జడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జరిగిన మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్‌లకు శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తల్లికి వందనం ద్వారా రాష్ట్రంలో సుమారు 67,47,110 మంది విద్యార్థులకు రూ.10,120 కోట్లు తల్లుల ఖాతాలో జమ చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది నుంచి 47,555 మంది గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని అంగన్వాడీ కార్యకర్తల పిల్లలకు తల్లికి వందనం అమలు చేసిందన్నారు. గత గొడ్డలి పార్టీ ప్రభుత్వంలో కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ మేనమామగా సాయం చేస్తానని చెప్పి.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కరికి మాత్రమే నగదు జమచేశారని విమర్శించారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని రద్దుచేసి పేద విద్యార్థుల కడుపు కొట్టారన్నారు. తొలుత పిల్లలతో వారి తల్లులకు పూలతో పాదపూజ చేయించారు. అనంతరం మంత్రి నిమ్మలను శాలువాతో దాత పెనుమాక రామ్మోహన్ దంపతులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, ఎంఈవో శర్మ, హెచ్ఎం వై.ప్రభాకర్‌శాస్త్రి, నాయకులు పాల్గొన్నారు.

ఆధునిక కవుల కల్పనలు.. అపురూప శిల్పాలు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణం సుబ్బారావుపేటలోని బుద్ధాల కన్వెన్షన్‌లో తెలుగు సాహితీ సమాఖ్య తాడేపల్లిగూడెం 665 కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సినీ గేయ రచయిత రసరాజు, గజల్ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రసరాజు ఆధునిక కవుల కల్పనలు-అపురూప శిల్పాలు అనే అంశంపై మాట్లాడారు. తనదైన శైలిలో తెలుగు సాహిత్యం గురించి వివరించారు. ఒక్కసారిగా సభను హాస్యలోకంలోకి తీసుకెళ్లారు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ తనదైన శైలిలో సమాజంలో మహిళ గొప్పదనంపై వివరించారు. కుటుంబ అభివృద్ధిలో స్త్రీపాత్ర ఎంత కీలకమో తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం తెలుగు సాహితీ సమాఖ్య నిర్వాహకులు రసరాజు దంపతులను, గజల్ శ్రీనివాస్‌లను సత్కరించారు. ముందుగా తాడేపల్లిగూడెం పట్టణ దేవత బలుసుల మ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సమాఖ్య నిర్వాహకులు, ప్రముఖులు ఈతకోట తాతాజీ, గట్టిం మాణిక్యాలరావు, పైలు శ్రీనివాసరావు, జంగా శ్రీనివాస్‌రామ్‌రాయ్, ఏపీ నాటక పరిషత్తుల సమాఖ్య అధ్యక్షుడు బుద్ధాల వెంకటరామారావు, బ్రహ్మజీ తదితరులు పాల్గొన్నారు.

వేదికపై మాట్లాడుతున్న గజల్ శ్రీనివాస్

స్పాట్ పెయింటింగ్‌లో రూ.లక్ష గెలుచుకున్న వెంపటాపు

తణుకు, న్యూస్‌టుడే: వికసిత్ భారత్ పేరిట నిర్వహించిన స్పాట్ పెయింటింగ్‌లో తణుకు పట్టణానికి చెందిన చిత్రకారుడు డా వెంపటాపు రూ.లక్ష ప్రథమ బహుమతి గెలుచుకున్నట్లు శుక్రవారం తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ కల్చర్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వికసిత్ భారత్ పేరిట గత ఏడాది అక్టోబర్‌లో ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్, రీజినల్ సెంటర్ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. శ్రీవేంకటేశ్వర శిల్ప కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో రూ.లక్ష చెక్కును ఎస్‌వీ వేదిక్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ రాణి సదా శివమూర్తి, ఎస్‌వీయూ మాజీ ప్రిన్సిపల్, డీన్ ఫ్యాకల్టీ ప్రొఫెసర్ డీ.కిరణ్ కాంత్ చౌదరి, రీజనల్ సెంటర్ డైరెక్టర్ డా కేటీవీ.రాఘవన్, శిల్ప కళాశాల ప్రిన్సిపల్ కె.వెంకటరెడ్డి, జాతీయ చిత్రకారుడు డా సాగర్ గిన్నె చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వెంపటాపును నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఆయన స్వగ్రామం ఇరగవరంలో గోపాలకృష్ణ, గోపి, రామకృష్ణ తదితరులు అభినందించారు.

వెంపటాపును సత్కరిస్తున్న నిర్వాహకులు

గీసిన చిత్రం

ఉజ్వల 'భవిత'కు బాటలు వేద్దాం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రత్యేక అవసరాల చిన్నారుల ఉజ్వల భవితకు బాటలు వేసేలా భవిత కేంద్రాలను తీర్చిదిద్దుతామని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం తన పుట్టినరోజు వేడుకను భీమవరంలోని భవిత కేంద్రంలో చిన్నారుల మధ్య నిర్వహించుకున్నారు. కేకు కోసి పిల్లలతో ఆనందం పంచుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో పిల్లలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ కుమారుడు భరత్, డీఈవో ఇ.నారాయణ, సమగ్రశిక్షా ఏపీసీ పి.శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల మధ్య కేకు కోస్తున్న కలెక్టర్ నాగరాణి

మావుళ్లమ్మ ఆలయంలో పూజలు.. భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మను కలెక్టర్ చదలవాడ నాగరాణి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. ఆమె పుట్టిన రోజు సందర్భంగా ప్రధానార్చకుడు మల్లికార్జున శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయాధికారి నగేశ్, ధర్మకర్తల మండలి ఛైర్మన్, సభ్యులు ఆమెకు శేషవస్త్రం, ప్రసాదం అందించారు.

కరాటేలో నరసాపురం విద్యార్థులకు పతకాల పంట

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురంలోని కరాటే విద్యార్థులకు కోయంబత్తూరులో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్‌లో పతకాల పంట పండింది. ఈ నెల 19న జరిగిన ఈ పోటీల్లో మనదేశంతోపాటు శ్రీలంక, ఇండోనేసియా, ఒమన్, మలేసియా దేశాల కరాటే విద్యార్థులు పాల్గొన్నారు. నరసాపురం విశ్వప్రతాప్ కరాటే అకాడమి నుంచి 14 మంది విద్యార్థులు పాల్గొని 28 పతకాలు సాధించారు. విజేతలను, శిక్షకుడు విశ్వప్రతాప్‌లకు పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

కాటా విభాగంలో.. 4 బంగారు పతకాలు, (జె.నవనీత్, కె.చక్రవర్తి, కె.దువాన్ష్ శ్యాం), 5 రజత పతకాలు (ఆర్.నవదీప్, జె.జశ్వంత్, కె.హర్ష, కె.హస్వంత్, కె.కీర్తిశ్రీ), 5 కాంస్య పతకాలు (జి.కార్తీక్, జె.శ్రీవల్లి, జె.శిరీష, ఎండీ.అబ్దుల్, మనోజ్.

కుమిటే విభాగంలో.. 5 బంగారు పతకాలు, (జె.నవనీత్, ఎండీ.అబ్దుల్, కె.హర్ష, జె.శ్రీవల్లీ, మనోజ్, 4 రజత పతకాలు (శ్యామ్, కె.హస్వంత్, కె.కీర్తిశ్రీ, కె.చక్రవర్తి, 5 కాంస్య పతకాలు (కె.దేవాన్ష్, జె.శ్రీవల్లీ, జె.శిరీష, ఆర్.నవదీప్, జి.కార్తీక్.

విజేతలతో శిక్షకుడు, చాంపియన్‌షిప్ నిర్వాహకులు

భూమికోసం గుడివాడలో మహిళ ఆత్మహత్యాయత్నం

గుడివాడ, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా గుడివాడలో ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా మండవల్లి మండలం చావలిపాడుకు చెందిన తలారి రమాదేవి (50) నెహ్రూచౌక్ సెంటర్‌లోని డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయుర్వేద క్యాప్సిల్స్ మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో అక్కడ విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది ఆమెను బలవంతంగా గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

తండ్రి కష్టార్జితం కాజేశారు: రమాదేవి.. చావలిపాడులోని నా తండ్రి రాంబాబు కష్టార్జితమైన 1.56 ఎకరాల పొలాన్ని బాబాయి వరుసైన తలారి కృష్ణమూర్తి అక్రమంగా అతడి కుమారుడు తలారి సత్యనారాయణ పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. కనీసం తినడానికి కూడా లేక నా తల్లి 70 ఏళ్ల వయస్సులో ఉపాధి పనులకు వెళ్లి పొట్టపోసుకుంటోంది. ఈ విషయంపై 20 ఏళ్ల క్రితం కోర్టును ఆశ్రయించగా కృష్ణమూర్తి కుటుంబం నేటి వరకూ 8 మంది అడ్వకేట్లను మార్చారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వివరిస్తే.. ఆయన కైకలూరు ఎమ్మెల్యేను కలవాలని తెలిపారు. అమ్మతో కలసి పలుమార్లు ఆయనింటికి వెళ్లినా అందుబాటులో లేక నిరాశతో తిరిగి వచ్చేశాము. తండ్రి సంపాదించిన ఆస్తిని అక్రమంగా సొంతం చేసుకున్న వారినుంచి దాన్ని తెచ్చుకోలేక నిస్సహాయ స్థితిలో చనిపోవాలని నిర్ణయించుకున్నాను. న్యాయం జరగకపోతే నాకు మరణమే శరణ్యం.

మలేరియాతో గిరిజన విద్యార్థిని మృతి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మలేరియా బారిన పడి తీవ్ర అస్వస్థతకు గురై బుట్టాయగూడెం మండలం మారుమూల గ్రామమైన పులిరాముడుగూడేనికి చెందిన గిరిజన విద్యార్థిని మడకం నందిత(12) శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. తల్లిదండ్రులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిత కామయ్యకుంట గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. ఈమె ఈ నెల 19న జ్వరం బారిన పడింది. సిబ్బంది గ్రామంలోని వైద్య సిబ్బందికి చూపించారు. తగ్గకపోవడంతో మరుసటి రోజు కేఆర్‌పురం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. గ్రామం, పీహెచ్‌సీలోనూ రక్త పరీక్ష చేయగా మలేరియా లేనట్లు వచ్చిందని చెబుతున్నారు. ఆ తర్వాత 21న పులిరాముడుగూడెం పీహెచ్‌సీకి తీసుకెళ్లగా అక్కడ పరీక్ష చేసి మలేరియా ఉన్నట్లు నిర్ధారించి చికిత్స చేశారు. ప్లేట్‌లెట్స్ పడిపోయాయి. మెరుగైన వైద్యానికి తీసుకెళ్లాలని సూచించారు. పరిస్థితి విషమించడంతో గురువారం కొయ్యలగూడెం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తీవ్ర అస్వస్థతకు గురై శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. కుమార్తె మృతితో తల్లిదండ్రులు విజయలక్ష్మి, వెంకటేశ్ కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు సంతానం. నందిత చిన్న కుమార్తె. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న కుమార్తె చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టైఫాయిడ్, మెదడు సంబంధిత మలేరియా ఉన్నట్లు వైద్యులు చెప్పారన్నారు. గిరిజన సంక్షేమ శాఖ కేఆర్‌పురం ఉప సంచాలకుడు జగన్నాథరావు, ఐటీడీఏ ఏఎంవో శిరమయ్య బాలిక కుటుంబాన్ని పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

నందిత (పాత చిత్రం)

ఉరేసుకుని పశ్చిమ బెంగాల్ వాసి..

పోడూరు, న్యూస్‌టుడే: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని దక్షిణ పారా గ్రామం నుంచి ఉపాధి కోసం పోడూరు మండలం కవిటం వచ్చిన సాగర్ మండల్ (19) శుక్రవారం తెల్లవారుజామున ఉరి వేసుకుని మృతి చెందినట్లు ఎస్సై సుధాకరరెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. సాగర్ మండల్, అతని సోదరుడు ఫిరోజ్ ముల్లా ఇద్దరూ కలిసి 45 రోజుల క్రితం ఉపాధి కోసం కవిటం వచ్చారు. మేడపాటి రామకృష్ణారెడ్డి, గాదె శ్రీనివాసరావు రొయ్యల చెరువులపై కాపలా ఉంటూ అక్కడే ఉన్న షెడ్డులో నివాసం ఉంటున్నారు. సాగర్‌మండల్ తను ప్రేమించిన అమ్మాయి రక్షణా కతూన్‌ను కూడా రప్పించుకుని ముగ్గురు కలిసి ఒకే షెడ్డులో ఉండేవారు. గురువారం రక్షణా కతూన్ చరవాణికి వేరొక చరవాణి నుంచి మెసేజ్‌లు రావడం గమనించిన సాగర్ మండల్ ఆమెను నిలదీశాడు. ఈవిషయమై వీరిద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున సాగర్ మండల్ కాళ్లు రక్షణా కతూన్‌కి తగలడంతో ఆమె నిద్ర నుంచి మేల్కొని చూసే సరికి పంఖాకి చున్నీతో ఉరేసుకుని కనిపించాడు. వీరి సమీప బంధువు ముల్లా మీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు..

కలిదిండి, న్యూస్‌టుడే : బకెట్లో నీరు వేడి చేసేందుకు విద్యుత్తు హీటర్ పెట్టి సరఫరా ఆపకుండా చెయ్యి పెట్టడంతో విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందినట్లు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు. కోరుకొల్లులోని పాత ఎస్సీ కాలనీకి చెందిన కురెళ్ల పండు(30) గురువారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో స్నానం చేస్తూ.. ఎలక్ట్రికల్ వాటర్ హీటర్ ఆఫ్‌లో ఉందని భావించి.. నీళ్లలో చేతులు పెట్టారు. చేతికి విద్యుత్తు షాక్ తగలడంతో ఒక్కసారిగా వెనక్కి పడిపోయారు. దీంతో తలకు తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు వెంటనే కైకలూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే పండు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని, పండు భార్య చిన్నారి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

శ్రీవారి సేవలో ప్రెస్ అకాడమీ ఛైర్మన్

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకా తిరుమల శ్రీవారి ఆలయాన్ని రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మన్ ఆల పాటి సురేశ్‌కుమార్ కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏఈవో దుర్గారావు శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు.

సురేశ్ కుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఏఈవో

26న దివ్యాంగ క్రీడాకారుల ఎంపిక

పాలకొల్లు సాంస్కృతికం, న్యూస్‌టుడే: అమరావతి ఇన్‌క్లూజివ్ క్రికెట్ కప్-2026 టోర్నమెంట్‌కు సంబంధించి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయి శారీరక దివ్యాంగుల క్రికెట్ క్రీడాకారుల ఎంపిక ఈనెల 26న తణుకులోని పైడిపర్రు వై జంక్షన్ వద్ద ఉన్న ఏఎస్ఆర్‌బీ ఈడీ క్యాంపస్‌లో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కన్వీనర్ లేళ్ల సుబ్బారాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (డీసీసీఏపీ), డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర(డీఏసీఏ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే దివ్యాంగ క్రీడాకారులు తమ వ్యక్తిగత క్రికెట్ కిట్‌లు, ఆధార్‌కార్డు, సదరం ధ్రువపత్రం, యూడీఐడీ కార్డు జిరాక్స్‌లు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు కమిటీకి అందజేయాలన్నారు. వివరాల కోసం 95159 21299, 97019 22334 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఐక్యతతోనే హక్కుల పరిరక్షణ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 1104 పశ్చిమగోదావరి సర్కిల్ ప్రథమ కౌన్సిల్ సమావేశం భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం జరిగింది. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎస్.నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్.ఆర్.కె.గణపతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యుత్తు రంగంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సాంకేతిక, పరిపాలనపరమైన సమస్యలను పరిష్కరించుకునేందుకు, హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పని చేయాలన్నారు. అనంతరం పశ్చిమగోదావరి జిల్లా కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా జి.హెచ్.వి.ఎస్.ప్రసాద్, కార్యదర్శిగా జి.శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.ప్రవీణ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎ.ఎన్.ఎం.కృష్ణమూర్తి నియమితులయ్యారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -147 రిటైల్ ధర 174 చికెన్ విత్ స్కిన్ - 270 చికెన్ స్కిన్‌లెస్ - 305.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 154, 163, 174 చికెన్ విత్ స్కిన్ - 294 చికెన్ స్కిన్‌లెస్ - 304.

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
శనివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥